సాక్షి
అనకాపల్లి
గురువారం । 31 । ఆగస్టు । 2023



రూ.16 కోట్లతో అభివృద్ధి


రూ.16 కోట్లతో అనకాపల్లిలో రహదారులను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు.

8లో



వర్సిటీలో రక్షాబంధన్

విశాఖ: ఏయూలో బుధవారం రక్షా బంధన్ నిర్వహించారు. వీసీ ప్రసాదరెడ్డికి బ్రహ్మాకుమారీలు రాఖీ కట్టారు.



శ్రావణ పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు

విశాఖ: ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

న్యూస్‌రీల్

అమరులైన పోలీసుల కుటుంబ సమస్యల పరిష్కారానికి చర్యలు



పోలీసు కుటుంబ సభ్యురాలికి చెక్కును అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో జిల్లాలోని అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. అపరిష్కృతంగా ఉన్న వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సర్వీసు, ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా భద్రత, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, కుటుంబ సభ్యుల కారుణ్య నియామకాలు తదితర అంశాలపై సమీక్షించారు. అంతకు ముందు పోలీసు కుటుంబ సభ్యులకు చెల్లించాల్సిన పరిహారం చెక్కులను అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏవో బి.శారద, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి సన్మానం



ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గుణను సత్కరించిన అధ్యాపకులు

పాయకరావుపేట: నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు మైలపల్లి గుర్రమ్మ (గుణ)ను బుధవారం ఘనంగా సన్మానించారు. జంతు శాస్త్ర విభాగంలో చేప ప్రత్యుత్పత్తిపై పరిశోధన చేసి ఆమె పీహెచ్‌డీ సాధించిన విషయం తెలిసిందే. గుర్రమ్మ ఇదే కళాశాల్లో ఇంటర్ (బైపీసీ) చదివి, ఇక్కడే ఒప్పంద అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఆమెకు డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, అధ్యాపకులు జి.సదయ్య, దేవన్న, సునంద, సింహాచలం, సత్యనారాయణ, పవన్ సందీప్ చెప్పారు. గుర్రమ్మ దంపతులను వారు సత్కరించారు.

ఏపీఎఫ్‌పీఎస్‌లో డీఆర్పీ పోస్టులకు దరఖాస్తులు

తుమ్మపాల: రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ(ఏపీఎఫ్‌పీఎస్)లో జిల్లా రిసోర్స్ పర్సన్(డీఆర్పీ)గా పనిచేసేందుకు ఆసక్తి గల నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ప్రభాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిగ్రీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, డిగ్రీలతో పాటు ఇతర డిగ్రీలు పూర్తి చేసి, బ్యాంకింగ్‌పై అవగాహన కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులకు అవగాహన కల్పించడం, బ్యాంకు లింకేజీ చేయించడం, ఆహార పరిశ్రమల స్థాపనకు వీరు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తిగా ఇన్సెంటివ్ పద్ధతిలో మాత్రమే ప్రయోజనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో వచ్చే నెల 4న, మధ్యాహ్నం 2 గంటలకు ఉద్యాన కార్యాలయం, గుండాల వీధి, తుమ్మపాల గ్రామం నందు స్వయంగా హాజరుకావాల్సిందిగా కోరారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి



ఎస్పీ మురళీకృష్ణకు స్వాగతం పలుకుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ సంబంధిత అధికారులను సూచించారు. పరవాడ డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన ఆయన, రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి సమష్టి కృషి చేయాలని సూచించారు. మంచి వాతావరణంలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేశారని అభినందించారు. ఆయన వెంట డీఎస్పీ సత్యనారాయణ, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు ఉన్నారు.

ఊళ్లకు సరికొత్త అందాలు!



కశింకోటలో ఆకట్టుకుంటున్న రైతు భరోసా కేంద్రం

- ఆర్బీకేలు, జీఎస్‌బీలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవనాలు
- ఉమ్మడి విశాఖలో వేగం పుంజుకుంటున్న నిర్మాణాలు
- సెప్టెంబర్ ఆఖరుకల్లా పూర్తికి సన్నాహాలు
- వీటికి మంజూరైన నిధులు రూ.508.50 కోట్లు
- ఇప్పటివరకు వెచ్చించిన సొమ్ము రూ.251.79 కోట్లు



దేవరాపల్లి మండలం కాశీపురంలో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం



ఎ.కొత్తపల్లి గ్రామ సచివాలయం

సాక్షి, విశాఖపట్నం: ఊళ్లు సరికొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. కొంగొత్త ప్రభుత్వ భవనాలతో శోభిల్లుతున్నాయి. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు), గ్రామ సచివాలయ భవనాలు (జీఎస్‌బీలు), వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల భవనాలు నిర్మితమవుతున్నాయి. వీటిలో ఇప్పటికే కొన్ని నిర్మాణం పూర్తి చేసుకోగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇలా పునాదుల దశ దాటిన భవనాలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి సంబంధిత శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 728 సచివాలయాలు, 701 రైతు భరోసా కేంద్రాలు, 543 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని తలపెట్టారు. వీటిలో గ్రామ సచివాలయ భవనాలకు రూ.260.57 కోట్లు, ఆర్బీకేలకు రూ.152.91 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.95.02 కోట్లు వెరసి రూ.508.50 మంజూరు చేశారు. ఇప్పటివరకు గ్రామ సచివాలయ భవనాలు 402, ఆర్బీకేలు 241, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు 126 పూర్తయ్యాయి. 326 జీఎస్‌బీలు, 456 ఆర్బీకేలు, 414 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు పురోగతిలో ఉన్నాయి. ఇందులో జీఎస్‌బీ లకు రూ.143.41 కోట్లు, ఆర్బీకేలకు రూ.66.85 కోట్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలకు రూ.41.53 కోట్లు వెచ్చించారు. కాగా పురోగతిలో ఉన్న వివిధ భవనాల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి వీటి పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్‌శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. పునాదుల స్థాయి దాటిన ఈ భవనాలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని విశాఖ జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ డీఎస్ రవీంద్ర 'సాక్షి'కి చెప్పారు.


మారుతున్న గ్రామాల స్వరూపాలు

ఒకప్పుడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలో, సామాజిక భవనాలో కనిపించేవి. చాలా పంచాయతీ కార్యాలయాల్లో పట్టుమని పది మంది కూర్చోవడానికి బెంచీలు తప్ప కుర్చీలు కూడా ఉండేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల రూపురేఖలను సమూలంగా మార్చివేస్తూ సరికొత్త పల్లెలకు నాంది పలుకుతున్నారు. ఊళ్లలో కొత్తగా నిర్మిస్తున్న ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలతో ఊళ్లు కొత్త కళను సంతరించుకుని ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఆయా భవనాల్లో కుర్చీలు, ఫర్నిచర్‌లతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మరే ప్రభుత్వం సంకల్పించని విధంగా ఈ ప్రభుత్వం హయాంలో నిర్మితమవుతున్న ఈ భవనాలు అన్ని హంగులతో కళకళలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



అమర్‌నాథ్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు

అన్నా.. నీ అనురాగం..!



రక్షాబంధన్.. కష్టసుఖాల్లో తోడుండే సోదరుడికి అక్కచెల్లెమ్మలు ఆత్మీయంగా కట్టే రాఖీ.. అన్న ఆశీర్వాదం తీసుకుంటే అదో భరోసా.. బంధాన్ని బలోపేతం చేసే సందర్భం రాఖీ పండగ.. అనకాపల్లి వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. స్కూల్‌కు వచ్చిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను అన్నగా భావించి విద్యార్థినులు రాఖీలు కట్టి ఆనందం వ్యక్తం చేశారు. వారి అభిమానానికి అమర్‌నాథ్ పొంగిపోయారు. స్వయంగా మంత్రికి రాఖీ కట్టినందుకు చిన్నారులు మురిసిపోయారు. అంతకుముందు స్కూల్ ఆవరణలో విద్యార్థినులు రాఖీ ఆకారాన్ని ప్రదర్శించారు. వారి విన్యాసం చూపరులను అబ్బురపరిచింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- అనకాపల్లి టౌన్

పక్కాగా ఓటరు సర్వే

- అవకతవకలకు తావు లేని విధంగా నమోదు
- ఓటర్ల ఇళ్లకు వెళ్లి స్వయంగా పరిశీలించిన కలెక్టర్



చీడికాడలో ఓటరు సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కేజీబీవీ విద్యార్థుల వర్కు బుక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

చీడికాడ/చోడవరం: ఓటరు సర్వే జరుగుతున్న తీరును కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి క్షుణ్ణంగా పరిశీలించారు. చీడికాడ, చోడవరం మండలాల్లో బుధవారం పర్యటించిన ఆయన స్వయంగా ఓటర్ల ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. చీడికాడలోని 93, 95 పోలింగ్ కేంద్రాల్లో మృతి చెందిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి నేరుగా ఆయా కుటుంబాలను ఆరా తీశారు. ఓటరు లిస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు సర్వేలో ఫారం–7, పంచనామా, డెత్ సర్టిఫికెట్, బీఎల్‌ఓ రిపోర్టులను తప్పనిసరిగా జత చేయాలని చెప్పారు. డబుల్ ఎంట్రీల తొలగింపును పక్కాగా చేయాలని సూచించారు. చోడవరం మండలంలో పీఎస్ పేట, జన్నవరం గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల పరిధిలో జరుగుతున్న ఓటర్ల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇచ్చిన ఫార్మేట్ ప్రకారం వివరాలను క్షేత్ర స్థాయిలోనే నమోదు చేయాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ పనిలో ఎవరైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓటర్ల సర్వేపై స్థానిక ప్రజలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గడువులోగా ఓటర్ల పరిశీలన జరగాలని, దీనిపై తహసీల్దార్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

విద్యార్థులతో మాటామంతీ

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చీడికాడ మండలంలోని జి.కొత్తపల్లి కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ట్యాబ్‌ల పనితీరు, బైజూస్ కంటెంట్‌పై ఆరా తీశారు. మెనూ పరిశీలించి భోజన పదార్థాలు, చిక్కీ, రాగి అంబలి రుచిపై విద్యార్థులను అడిగారు. బైజూస్ కంటెంట్ వలన తమకు ఎంతో మేలు జరుగుతుందని విద్యార్థినులు కలెక్టర్ వద్ద ఆనందం వ్యక్తం చేశారు. 6, 9 తరగతి విద్యార్థులకు బెంచ్‌లు సరిపోకపోవడంతో నేలపై కూర్చున్నారు. దీనిపై కలెక్టర్ ఆరా తీశారు. నాడు–నేడులో బెంచీల కోసం ఇండెంట్ పెట్టామని మరో రెండు, మూడు రోజుల్లో 60 బెంచీలు వస్తాయని ప్రిన్సిపాల్ తెలిపారు. లైబ్రరీని పరిశీలించి సరిగా సర్దుబాటు చెయ్యలేదని, సబ్బవరం కేజీబీవీలో లైబ్రరీని పరిశీలించి ఆ తీరుగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల నిర్వహణ, ఫలితాలు బాగున్నాయని సిబ్బందిని మెచ్చుకున్నారు. కలెక్టర్ వెంట డీఈవో వెంకటలక్ష్మమ్మ, తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్ తదితరులున్నారు.

ఓటరు జాబితా సవరణకు శతశాతం గృహాల సర్వే

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సంక్షిప్త ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఓటర్ల జాబితాలో మరణించి, శాశ్వత వలసలు వెళ్లిన వారి పేర్లను తొలగించే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణకు నూరు శాతం గృహాలను సర్వే చేశామన్నారు. ఓట్ల తొలగింపుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇప్పటి వరకు 37,041 మంది మృతులు, 12,534 మంది శాశ్వత వలసలు, 18,871 మందిని ఆబ్సెంట్ ఓటర్లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, తుది నిర్ధారణ చేస్తామన్నారు. కొన్ని దరఖాస్తులు పరిశీలనకు అనర్హమైనవిగా గుర్తించామన్నారు. నూతనంగా ఓటుహక్కు పొందడానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారిని జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు. ఓట్ల సవరణ జాబితా పక్కాగా రూపొందించడానికి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో అనిత, ఆర్డీవో చిన్నికృష్ణ, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవోలుగా నలుగురికి పదోన్నతి!

- ఉదయం కౌన్సెలింగ్.. సాయంత్రానికే ఉత్తర్వులు
- పారదర్శకతకే పెద్దపీట వేశారంటూ కితాబు
- త్వరలో మరికొందరికి చాన్స్!

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో నలుగురికి ఎంపీడీవోలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో అనకాపల్లి జిల్లా నుంచి ముగ్గురు, విశాఖ జిల్లా నుంచి ఒక్కరు ఎంపీడీవోలుగా పదోన్నతి పొందారు. అనంతరం వీరిని వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన పరవాడ మండలం ఈవోపీఆర్‌డీ పి.పద్మజను పశ్చిమ గోదావరి జిల్లాకు, నక్కపల్లి మండలం ఈవోఆర్‌డీ పి.వెంకటనారాయణను కాకినాడ జిల్లాకు, అచ్యుతాపురం ఈవోఆర్‌డీ మంతెన రాధికను విజయనగరం జిల్లాకు కేటాయించారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఆనందపురం మండల పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావును ఎంపీడీవో పదోన్నతి కల్పిస్తూ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. రాష్ట్రంలో బుధవారం కౌన్సెలింగ్ ద్వారా 70 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించగా వీరిలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి నలుగురికి అవకాశం దక్కింది. గత జూన్‌లో నిర్వహించిన పదోన్నతుల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరుగురు ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందారు. త్వరలో మరో నలుగురికి ఎంపీడీవోలుగా పదోన్నతులు లభిస్తాయని తెలుస్తోంది.

పదోన్నతుల్లో పారదర్శకత

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద సంఖ్యలో అర్హులకు పదోన్నతులు దక్కడమే కాదు.. పారదర్శకత పాటించారంటూ పదోన్నతులు పొందిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సిఫార్సులు లేకుండా, మెరిట్ ఆధారంగా నిబంధనలకు అనుగుణంగా అర్హులకు ప్రమోషన్లు లభించాయని పేర్కొంటున్నారు. బుధవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించగా.. సాయంత్రానికి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్టీఆర్ వైద్యాలయ ఇన్‌చార్జి డీసీహెచ్‌గా శ్రీనివాసరావు



డాక్టర్ శ్రీనివాసరావు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ ఇన్‌చార్జి డీసీహెచ్‌గా ఎస్.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదే వైద్యాలయంలో ఆర్థోపెడిక్ వైద్యునిగా పని చేసేవారు. ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జి డీసీహెచ్ శ్రావణ్‌కుమార్‌కు కృష్ణా జిల్లా ప్రభుత్వాస్పత్రి డీసీహెచ్‌గా పదోన్నతి లభించింది. ఆయన స్థానంలో శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతల్ని ప్రభుత్వం అప్పగించింది.

దివ్యాంగులే గానీ ఆటల్లో దిట్టలు



పరుగుపోటీకి సంసిద్ధం అవుతున్న దివ్యాంగ బాలలు

క్రీడా కౌశలంతో అబ్బురపరిచిన బాలలు



జావెలిన్ విసురుతున్న దివ్యాంగ విద్యార్థి



స్లో వాకింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రన్నింగ్‌లో ప్రథమ బహుమతి పొందిన రావలపూడి రాజేష్

చోడవరం రూరల్: పరుగులో ప్రతిభ చూపారు.. షాట్‌పుట్, జావెలిన్ విసిరి ఆశ్చర్యపరిచారు.. క్రీడా ప్రతిభలో ఎవరికీ తీసిపోమని రుజువు చేశారు.. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అనకాపల్లి జిల్లా శాఖ, విశాఖ రోటరీ క్లబ్ సెంటోనియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఆటల పోటీలు అలరించాయి. వారి ప్రతిభా పాటవాలు అబ్బురపరిచాయి. వారిలో ఉరకలేస్తున్న క్రీడోత్సాహం ముచ్చట గొలిపింది. జిల్లాలోని 52 సహిత విద్యా పాఠశాలల నుంచి పాల్గొన్న 236 బాలబాలికల్లో 6 నుంచి 11 సంవత్సరాల వారిని జూనియర్స్‌గా, 12 నుంచి 18 సంవత్సరాల బాలబాలికలను సీనియర్స్‌గా విభజించారు. వారిలో శారీరక, మానసిక, దృష్టి, శ్రవణ వైకల్యాలను బట్టి ఐదు రకాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు రన్నింగ్, స్లో వాకింగ్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్క్ త్రో పోటీలు జరిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ జిల్లాలోని 24 మండలాల్లో ఉన్న శారీరక, మానసిక, దృష్టి, వినికిడి లోపం గల ప్రత్యేక అవసరాలున్న బాలబాలికలకు ప్రతీ ఏటా ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు డీఈవో వెంకటలక్ష్మమ్మ, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కె.వి.వి.ఎస్.మూర్తి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయాధికారి బి.శకుంతల, జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దివ్యాంగులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో సహకరిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీరు ఉన్నంత వరకు యథావిధిగా సరఫరా

● 'తాండవ' రైతుల సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈఈ స్వామినాయుడు

నాతవరం: తాండవ ప్రాజెక్టులో నీరు ఉన్నంత వరకూ యథావిధిగా ఆయకట్టు భూములకు సరఫరా చేయాలని అధిక శాతం మంది ఆయకట్టు రైతులు సూచించారు. స్థానిక తాండవ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతులతో అత్యవసర సమావేశం నిర్వ హించారు. రైతుల సూచన మేరకు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఈఈ జె.స్వామినాయు డు.. తాండవ ప్రాజెక్టులో నీటి నిల్వల గురించి వివరించారు. ప్రతి రోజూ ప్రధాన కాలువల ద్వారా 550 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని, బుధవారం నాటికి ప్రాజెక్టులో 364.5 అడుగుల నీరు ఉందన్నారు. ఇదే విధంగా నీరు విడుదల చేస్తే 35రోజులకు మాత్రమే వస్తుందన్నారు. ప్రాజెక్టులో నీటిని ఎలా విడుదల చేయాలో ప్రజా ప్రతినిధులు, ఆయకట్టుదారులు నిర్ణయించాలని కోరారు. తాండవ ప్రాజెక్టులో నీరు ఉన్నంత వరకూ యథావిధిగా ఆయకట్టు భూములకు సరఫరా చేయాలని అధిక శాతం మంది రైతులు సూచించారు. ఈకార్యక్రమంలోఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూరరాజు, పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టరు పైల పోతురాజు, నాతవరం మండల వ్యవసాయాధికారి శైలజ, కోటనందూరు వ్యవసాయాధికారి కిల్లాడ శివకుమారి, ప్రాజెక్టు పరిధిలో జేఈలు శ్యామ్‌కుమార్, వినయ్‌కుమార్, పాత్రుడు,రామకృష్ణ,నాగబాబుఅప్పారావుపాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ): జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో సెప్టెంబర్ ఒకటో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్),కె.శాంతి(టెక్ని కల్) తెలిపారు. ఐఐఎఫ్ఎల్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఆధాష్ సొల్యూషన్స్, ఎంఏఎస్ మెరైన్ స ర్వీసెస్, ట్రీని టెక్ ఇన్ఫ్రా ఇండియా, టీం లీజ్, బయోఫోర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, మేధా సర్వో డ్రైవ్, రిలయన్స్ డిజిటల్ తదితర కంపెనీల్లో 640 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మాసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, కార్పెంటర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గొడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన మహిళా, పురుష అభ్యర్థులు అర్హులు. వయసు 18–45ఏళ్ల మధ్య ఉండాలి. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.12,500 నుంచి రూ40,000 వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in లో పేర్లు నమోదు చేసుకుని.. శుక్రవారం జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని వారు కోరారు.

రూ.16 కోట్లతో అభివృద్ధి పనులు

● అందాలపల్లిగా అనకాపల్లిని తీర్చిదిద్దుతా
● ఆరు దేవాలయాలకు పాలక మండళ్లు
● మీడియాతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



రైల్వేస్టేషన్ నుంచి అండర్‌బ్రిడ్జి బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: జిల్లా ప్రధాన కేంద్రమైన అనకాపల్లి పట్టణాన్ని అందాలపల్లిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది విజయదశమిలోపు పట్టణంలో ప్రధాన రహదారులను రూ.16 కోట్లతో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ పనులు ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నట్లు తెలిపారు. సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి, పూడిమడక జాతీయ రహదారి నుంచి గుండాల జంక్షన్ వరకూ ప్రధాన రహదారి నిర్మాణపనులు చేపట్టి, రూ.3.50 కోట్లతో సెంటర్ విద్యుత్ దీపాలు, ఫుట్‌పాత్‌పై పాదచారులు నడిచేందుకు టైల్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి కోట్నివీధి రహదారి అభివృద్ధికి రూ.48 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గాంధీబొమ్మ జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు పెరుగుబజార్ జంక్షన్‌వరకూ రహదారి విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. విస్తరణ పనులతోపాటు, రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం, వీధిలైట్లు ఏర్పాటుకు రూ.3 కోట్లు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. విశాఖ నుంచి అనకాపల్లి వచ్చే రహదారిలో జలగల మదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకూ ఇరువైపులా విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి నుంచి శంకరం గ్రామం వరకూ శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు పనుల్ని ఎన్‌హెచ్ఏఐ సహకారంతో పూర్తి చేశామన్నారు. పట్టణ సుందరీకరణకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా రహదారుల నిర్మాణపనులు జరుగుతున్నాయన్నారు. మండలంలో కొత్తూరు పంచాయతీ కార్యాలయం సమీపంలో కొత్తూరు చెరువును లారెన్స్ కంపెనీ సహకారంతో వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాల ఏర్పాటు పనులు నెల రోజుల్లో పూర్తికానున్నట్లు తెలిపారు. 2014 నుంచి పార్టీ కోసం పనిచేసిన ప్రతి వ్యక్తిని గుర్తించి, తగిన గౌరవం ఇస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

6 దేవాలయాలకు కొత్త పాలకమండళ్లు

పట్టణంలో ప్రముఖ దేవాలయాలకు సంబంధించిన పాలక మండళ్లను మంత్రి అమర్‌నాథ్ ప్రకటించారు. గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా కొణతాల మురళీకృష్ణ, గవరపాలెం భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఆళ్ల నాగేశ్వరరావు, సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్‌గా కె.ఎం. నాయుడు, సిద్ధిలింగేశ్వర స్వామిదేవస్థానం చైర్మన్‌గా నుదురుపాటి తాతాజీ, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్లుగా తాటికొండ కాంబాబు, జీవన్ నియమితులయ్యారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.జీవీఎంసీ విలీనగ్రామాలైన రాజుపాలెంప, వల్లూరు, ఎరుకువానిపాలేనికి వెళ్లే రహదారితోపాటు, కేఎస్ఆర్ పేట నుంచి వల్లూరు బీటీ రోడ్డుకు, స్థానిక కోల్డ్ స్టోరేజ్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా అండర్ బ్రిడ్జివరకు చేపట్టనున్న బీటీ రోడ్లకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈరహదారి నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, కొణతాల మురళీకృష్ణ, గొర్లి సూరిబాబు, కొణతాల నీలిమ, మందపాటి జానకీరామరాజు, జాజుల రమేష్, ఆళ్ల నాగేశ్వరరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల : వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ప్రత్యామ్నాయ పంటపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ –క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ సాగును పెంచేలా రైతులకు సూచించాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంలో ఇంకా ప్రారంభం కాని 112 పాల సేకరణ కేంద్రాలను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేయాలన్నారు. డొమెస్టిక్ చేపల విక్రయ కేంద్రాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు కలిగిన కౌలు రైతులందరికీ రుణాలు అందించడానికి బ్యాంకులతో సమీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ బి.మోహనరావు, ఉద్యానవన శాఖ ఏడీ ప్రభాకరరావు, సెరికల్చర్ ఏడీ వర్మ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి, మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్, ఫిషరీస్ అధికారి ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ చైర్మన్‌గా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ



అమ్మవారి సన్నిధిలో సంతకం చేసి బాధ్యతలు స్వీకరిస్తున్న కొణతాల మురళీకృష్ణ



నూతన చైర్మన్ కొణతాల మురళీకృష్ణను సత్కరిస్తున్న మందపాటి జానకీరామరాజు, జాజుల రమేష్

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ చైర్మన్‌గా కొణతాల మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనతోపాటు పాలికమండలి సభ్యులు కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మి, పాము అనూరాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమాచంద్రమహేశ్వరి, బుద్ధ నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబర్ వై.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ నూతన కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అమ్మవారి సన్నిధిలో సంతకం చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ నూతన కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సకల గోవింద, కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కొణతాల శ్రీనివాసరావు, బొండా శంకరరావు, వేగి త్రినాథ్, కొణతాల కృష్ణంరాజు, ఆడారి చక్రవర్తి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కశింకోట వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావును నియమిస్తున్నట్లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ సభ్యులను త్వరలో ప్రకటించనున్నామన్నారు. మండలంలో సత్యనారాయణస్వామి దేవస్థానానికి మూడు రోజుల్లో పాలకమండలిని ప్రకటించనున్నట్లు చెప్పారు.

బొడ్డేడకు బ్రహ్మకుమారీ రక్షాబంధన్



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి శ్యామల

మునగపాక: మండల వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు బ్రహ్మకుమారి శ్యామల రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని ప్రసాద్ ఆకాంక్షించారు. అన్నా చెల్లెళ్ల,అక్కా తమ్ముళ్ల మధ్య ఐక్యమత్యానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు.

ప్రశాంతంగా మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



పోటీలో పరుగు తీస్తున్న మహిళా అభ్యర్థులు

ఆరిలోవ(విశాఖ): ఎస్ఐ మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ నియామకాల కోసం విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో అభ్యర్థులకు కొద్ది రోజులుగా దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు జరగనున్న పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకే అభ్యర్థులు హాల్ టిక్కెట్లు, సర్టిఫికెట్లతో మైదానం వద్దకు హాజరయ్యారు. రేంజ్ డీఐజీ ఎస్. హరికృష్ణ పర్యవేక్షణలో, విజయనగరం ఎస్పీ దీపికాపాటిల్ సమక్షంలో పోలీస్ అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం ఎత్తు, బరువు తదితర పరీక్షలు జరిపారు. అందులో ఎంపికైన వారికి 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనబరిచిన వారికి లాంగ్ జంప్ నిర్వహించారు. ఆయా పోటీల్లో మహిళా అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరుగులో మొదటి స్థానం కోసం హుషారుగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా డీఐజీ హరికృష్ణ మాట్లాడుతూ 2,745 మంది మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు 685 మందికి హాల్ టిక్కెట్లు పంపగా వారిలో 512 మంది హాజరయ్యారన్నారు. అవకతవకలకు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ఆయన సూచించారు.

సచివాలయ వ్యవస్థతో సత్ఫలితాలు

● ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి
● జుత్తాడలో సచివాలయ భవనానికి ప్రారంభోత్సవం



జుత్తాడలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతి

చోడవరం: ప్రజలకు గ్రామస్థాయిలో సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎంజగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బీవీ సత్యవతి అన్నారు. చోడవరం మండలంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బీవీ సత్యవతి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోనే ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. కొత్తగా వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు పక్కా భవనాలు, సిబ్బంది,వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయ డం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా ఇంటికే అందిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలకు అండగా ఉంటుందన్నారు ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యా రావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, వైస్ఎంపీపీలు బుద్ద గంగరాజు బైన ఈశ్వరరావు, సర్పంచ్‌లు ప్రసాద్, మళ్లశ్రీనివాసరావు, శీరం రెడ్డి వెంకటరమణ, దంతులూరి శ్రీనివాసరాజు, పీఏసీఎస్అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు,మండల బీసీసెల్అధ్యక్షుడు మొల్లిసోమునాయుడుపాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీపై కేసు నమోదు

నర్సీపట్నం: రిమాండ్ ఖైదీ పరారీపై నర్సీపట్నం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ ఎస్.గణేష్ అందించిన వివరాలు...ఇద్దరు వ్యక్తులను కిడ్నాప్ చేసి, బెదిరించి దోపిడీ పాల్పడిన కేసులో చింతపల్లి మండలం మేడూరు గ్రామానికి చెందిన కిల్లో గణేష్‌తో పాటు మరో ఇద్దరిని చింతపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో గణేష్‌కు రిమాండ్ విధించడంతో ఈ నెల 29న చింతపల్లి పోలీసులు విశాఖ సెంట్రల్ జైలుకు తరలిస్తూ, భోజనం చేసేందుకు నర్సీపట్నంలోని ఓహోటల్‌కు వెళ్లారు. ఈ సమయంలో పోలీసుల కళ్లు కప్పి నిందితుడు కిల్లో గణేష్ పరారయ్యాడని సీఐ తెలిపారు. చింతపల్లి పోలీసుల ఫిర్యా దు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

'కళ' నెరవేరిన వేళ..

గాయకుడిగా రాణిస్తున్న రాజుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న జామి అప్పలరాజు

మునగపాక: ప్రతి ఒక్కరూ కలలు కంటారు. కొంత మంది మాత్రమే తమ కలలను సార్థకం చేసుకుంటారు. అటువంటి కోవకే వస్తారు మండలంలోని నాగులాపల్లికి చెందిన జామి అప్పలరాజు (సింగర్ రాజు). నిరుపేద కుటుంబంలో జన్మించినా కళలపై మక్కువతో గాయకుడిగా రాణించడంతో పాటు తోటి కళాకారులను ఆదుకుంటున్నారు. ఆయన సేవలను గుర్తించిన హైదరాబాద్‌లోని హెచ్ఎస్‌సీ యూనివర్సిటీ ఇటీవల డాక్టరేట్ ప్రదానం చేసింది. నాగులాపల్లికి చెందిన జామి నూకరాజు, చినమ్మ(సర్పంచ్)ల దంపతుల కుమారుడు అప్పలరాజు తన గానంతో ప్రముఖ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్, కీరవాణి వంటి వారిని కూడా మెప్పించారు. కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు. ఉత్తరాంధ్ర సింగర్స్ అసోసియేషన్ స్థాపించడంతో పాటు 426 మంది కళాకారులకు రూ.10 లక్షల చొప్పున ఇన్సూరెన్స్ చేయించారు. కరోనా కష్టకాలంలో 4,500 మందికి నిత్యావసర సరకులు అందించారు. కరోనాతో చనిపోయిన వ్యక్తుల అంత్యక్రియల్లో రాజు సాయమందించారు. అనకాపల్లి కేంద్రంగా జేటీఆర్ రికార్డింగ్ స్టూడియో, జేటీఆర్ మ్యూజిక్ అకాడమీ స్థాపించి నూతన గాయనీగాయకులకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. 2019 నుంచి విశాఖజిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా పనిచేసిన రాజు ఇటీవల వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాజుకు డాక్టరేట్ రావడం పట్ల నాగులాపల్లి గ్రామస్తులతో పాటు అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో 16 రోజుల శిశువు మృతి

మహారాణిపేట: జగదాంబ జంక్షన్‌లో ఉన్న మెడికవర్ ఆస్పత్రిలో 16 రోజుల మగ శిశువు చనిపోయాడు. ఈనెల 15న అనకాపల్లి జిల్లా పాపయ్య సంతపాలెం గ్రామానికి చెందిన తలారి గణేష్, సాయి దంపతులకు మగశిశువు జన్మించాడు. నెలలు నిండకుండానే ఏడో నెలలో శిశువు జన్మించాడు. ఈ క్రమంలో బరువు తక్కువగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తల్లిందద్రులు మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించారు. హార్ట్‌లో హోల్ ఉండడం వల్ల శిశువుకు డాక్టర్ సునీల్ శస్త్ర చికిత్స చేసి పర్యవేక్షించారు. శిశువును ఆస్పత్రిలో చేర్పించి బుధవారం నాటికి 16 రోజులయ్యాయి. బుధవారం ఉదయం శిశువు ఆరోగ్య పరిస్థితి ఏమి బాగాలేదని, వెంటిలేటర్ మీద చికిత్స అందిస్తున్నట్టు డాక్టర్ సునీల్ ఆస్పత్రి నుంచి ఫోన్ చేసి తల్లిదండ్రులకు చెప్పారు. కొద్ది సేపటి తర్వాత శిశువు చనిపోయాడని, ఇంకా రూ.4.4 లక్షలు చెల్లించాలని తల్లిదండ్రులకు ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. దీంతో ఆందోళన చెందిన గణేష్, సాయి అంత డబ్బులు తాము చెల్లించలేమని, ఇప్పటికే రూ.3 లక్షలకు పైగా చెల్లించామని ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. చివరకు ఆస్పత్రి యాజమాన్యంతో చర్చించి చనిపోయిన మగశిశువును తీసుకొని ఇంటికి వెళ్లిపోయారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాయకరావుపేట: స్థానిక ఇందిరా కాలనీ సమీపాన గల రైల్వే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో తుని నుంచి నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు నుంచి పడి మరణించినట్టు ఆయన తెలిపారు. మృతుడు వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని, పసుపు రంగు షర్టు, చారల లుంగీ మృతదేహానికి కొద్దిగా దూరంలో ఉన్నాయని చెప్పారు.

మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు.

శివాలయంలో చోరీ

చీడికాడ: మండలంలోని ఎల్.బి.పట్నం శివాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. హుండీ పగలగొట్టి సుమారు వెయ్యి రూపాయలు అపహరించినట్టు చెప్పారు. సీసీ కెమెరాకు చెందిన మానిటర్ కూడా చోరీకి గురైనట్టు గుర్తించామని తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

క్లుప్తంగా

దివ్యాంగ పరికరాలు అందించాలని వినతి



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న వీరుయాదవ్

అనకాపల్లిటౌన్: దివ్యాంగు సమస్యలను పరిష్కరించాలని ఎంపీ బీవీ సత్యవతిని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ కోరారు. బుధవారం ఎంపీ కార్యాలయంలో కలిసిన ఆయన ఎంపీకి వినతి పత్రం అందించారు. బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు తదితర దివ్యాంగ పరికరాలు అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయన వెంట సంఘ సభ్యులున్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతి పత్రం అందిస్తున్న శ్రీనివాసరావు

కశింకోట: విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మిలు కోరారు. బుధవారం కశింకోట వచ్చిన మంత్రిని కలిసి, వినతి పత్రాన్ని అందించారు. స్థానిక గవరపేటలో శారదానదిపై నిలిచిపోయిన వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

వంతెనకు మరమ్మతులు చేయాలని వినతి

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం వద్ద వంతెన రక్షణగోడ లేకపోవడంతో ప్రజలు భయపడుతున్నారు. 50 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన కాస్త దెబ్బతింది. రక్షణ గోడలు కూలిపోయాయి. దీంతో రాత్రి వేళ అదుపుతప్పి వంతెనపై నుంచి పడిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాలకు కారణమవుతున్న వంతెనను తొలగించి, రోడ్డుతో సమానంగా వంతెనను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
దక్ష	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
కింగ్ ఆఫ్ కోథా	: పర్తిసాయి
గాండీవధారి అర్జున	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
బెదురులంక 2012	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 181 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,210	4,490
రెండో రకం	4,010	4,060
మూడోరకం	3,800	3,940

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

హెల్త్ క్లినిక్‌లకు సొంత గూడు



ఉగ్గినపాలెంలో అందంగా రూపుదిద్దుకున్న హెల్త్ క్లినిక్ భవనం



జి.భీమవరంలో ముస్తాబవుతున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

విద్య, వైద్యం.. సామాన్యుల సంపాదనలో సగం వ్యయం వీటిపైనే. అందుకే సీఎం జగన్ ప్రభుత్వం ఈ రెండు రంగాల్లో సామాన్యులకు మెరుగైన సేవలందేలా రూ.వేల కోట్ల నిధులు వెచ్చిస్తోంది. కశింకోట మండలంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆధునిక వసతులతో అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. సొంత భవనాల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకుంది.

- రూ.2.80 కోట్లతో భవన నిర్మాణాలు
- పది భవనాల్లో మూడింటి నిర్మాణం పూర్తి
- కశింకోటలో సకల వసతులతో విలేజ్ క్లినిక్‌లు

కశింకోట: మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లకు రూ.2.80 కోట్లతో సొంత భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మండలానికి పది భవనాలు మంజూరు కాగా, వాటిలో ఇప్పటికే మూడు భవనాల నిర్మాణం పూర్తి అయింది. ఇవి అందంగా ముస్తాబు అయ్యాయి. మరో ఏడు భవనాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కరోనాతో పెరిగిన నిర్మాణ వ్యయం

మండలంలో అమీన్‌సాహెబ్‌పేట, జెట్టపురెడ్డితుని, అచ్చెర్ల, జి.భీమవరం, ఉగ్గినపాలెం, నూతలగుంటపాలెం, చింతలపాలెం, తీడ, ఈ.చౌడువాడ, తేగాడ సచివాలయాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు 2019లోనే ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణ బాధ్యతల్ని పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. తొలుత ఒక్కో క్లినిక్ భవనానికి రూ.17.50 లక్షలు ప్రతిపాదించారు. కరోనా అనంతర పరిణామాలతో పెరిగిన మెటీరియల్ ధరలతో నిర్మాణ వ్యయాన్ని ఒక్కో దానికి రూ.20.80 లక్షలకు ప్రభుత్వం పెంచింది. దీంతో ఉగ్గినపాలెం, జి.భీమవరం, తీడలలో హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం పూర్తయింది. ఉగ్గినపాలెం హెల్త్ క్లినిక్ భవనానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. జి.భీమవరం భవనాన్ని కూడా తీర్చిదిద్దారు. ఇక తీడ భవనం నిర్మాణం పూర్తి అయినప్పటికి రంగులు వేయాల్సి ఉంది.

శరవేగంగా మిగిలిన నిర్మాణాలు

తేగాడ, ఏఎస్ పేట హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. అచ్చెర్ల, ఈ.చౌడువాడులో భవనాలు రూఫ్ లెవెల్‌లో, చింతలపాలెం, నూతలగుంటపాలెం, జెట్టపురెడ్డితుని భవనాలు పునాది స్థాయిలో ఉన్నాయి. వీటిని సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని అధికారులు నిర్దేశించారు. అయితే వీటిని సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయడానికి అధికారులు కాంట్రాక్టర్లను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే రూ.80 లక్షల మేర చెల్లింపులు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం హెల్త్ క్లినిక్‌లు ప్రైవేట్ భవనాల్లో తాత్కాలికంగా నడుస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా వైద్య, ఆరోగ్య సేవలందిస్తున్నాయి. ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నాయి. వీటికి సొంత భవనాలు పూర్తి అయితే మరింత మెరుగ్గా, సౌకర్యవంతంగా సేవలు అందగలవని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాల వేగవంతానికి చర్యలు

ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలక్కూడా మెరుగైన వైద్య సేవలందించాలని సంకల్పించింది. అందులో భాగంగానే కశింకోట మండలంలో పది హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మూడు భవనాల నిర్మాణం పూర్తి కాగా, రెండు భవనాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేదు. పనుల ప్రగతి మేరకు నిధులు విడుదలవుతున్నాయి.

– కె.లక్ష్మణరావు, మండల ఇంజనీర్, కశింకోట.

దేవాలయాలకు కొత్త పాలక వర్గం



దేవాలయాల నూతన చైర్మన్లను శాలువాలతో సత్కరించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- ఆరు దేవాలయాలకు నూతన పాలక మండళ్లు
- ప్రకటించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: పట్టణంలోని ప్రముఖ దేవాలయాలకు సంబంధించిన పాలకమండళ్లకు నూతన చైర్మన్లు, కమిటీలను ప్రభుత్వం నియమించినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. బుధవారం స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తొలి దశలో 6 దేవాలయాలకు నూతన కమిటీల నియామకం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వాటి వివరాలను వెల్లడించారు.

- గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా కొణతాల మురళీకృష్ణ, సభ్యులుగా కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మి, పాము అనురాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమా చంద్రమహేశ్వరి, బుద్ద నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా వై.శ్రీనివాసరావులను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు.
- గవరపాలెం భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఆళ్ల నాగేశ్వరరావు, సభ్యులుగా సింగంపల్లి రాజేశ్వరి, కొణతాల అప్పాజీ, మెలిపాక దుర్గ, కాండ్రేగుల రాము, కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా టి.నారాయణరావులు నియమితులయ్యారు.
- సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్‌గా కె.ఎం.నాయుడు, సభ్యులుగా నేతల చంద్రకళ, పెంటకోట అప్పలనాయుడు, తగరంపూడి నరసింగరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, తాడి నాగలక్ష్మి, వియ్యపు ముకుంద, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఎం.విద్యాసాగర్‌లను నియమించారు.
- దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా సకలా రాజ్యలక్ష్మి, సభ్యులుగా ఎం.పైడిరాజు, సుంకర వెంకట్రావు, సూరిశెట్టి చిన్నసన్యాసిరావు, శ్రీధరాల కోమలి, ఆర్.లక్ష్మి, లింగం అనురాధ, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా పి.గిరిబాబు నియమితులైనట్లు తెలిపారు.
- సిద్ధిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా నుదురుపాటి తాతాజీ, సభ్యులుగా కె.వి.త్రివేణి, ఇ.నూకరత్నం, నాగులపల్లి వీర్రాజు, నాగ భోగలింగస్వామి, కుందరపు లక్ష్మి, ఎం.పరమ్మ, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఎస్.మల్లిఖార్జునలను నియమించినట్లు పేర్కొన్నారు.
- వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం శాశ్వత చైర్మన్లుగా తాటికొండ కాంబాబు, జీవన్ సభ్యులుగా గట్టిరెడ్డి నూకరాజు, ఒడిశెట్టి కనకమహాలక్ష్మి, నిమ్మకాయల నాగమణి, కొడుకుల వీఎస్ఆర్ఎస్ సుబ్రహ్మణ్యం, ద్రాక్షారపు లలిత, కొమ్మన శంకరరావు, ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా డి.ఎస్.ప్రకాశరావు నియమితులయ్యారు.

ఆరు దేవాలయాల కమిటీల్లో సుమారు 40 మందికి అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. పార్టీలో కష్టించి పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదేనన్నారు. అనంతరం కొత్తగా నియమితులైన దేవాలయాల కమిటీ చైర్మన్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర నేడు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు



మరిడిమాంబ అమ్మవారు

అనకాపల్లిటౌన్: నమ్మి కొలిచిన వారి కొంగు బంగారం కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు, కోరుకొండ రాఘవ మిత్ర మండలి బృందం ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు శ్రీసత్యసాయిభజన మండలి వారిచే అమ్మవారి మేలుకొలుపు సేవ, అనంతరం అమ్మవారికి పలురకాల అభిషేకాలు, ప్రత్యేక కుంకుమార్చనలు జరగనున్నాయి. తర్వాత మేళతాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. నవదుర్గ పీఠం వారిచే పూల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమీయనున్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కమిటీ సభ్యులు కోరారు.

సాంస్కృతిక కార్యక్రమాలివే..

అమ్మవారి జాతర సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు నేల డ్యాన్స్‌లు, సాయంత్రం 4 గంటలకు ఏలి ఏనుగు ఊరేగింపు, రాత్రి 7 గంటలకు కోరుకొండ రాఘవ మిత్ర మండలి సహకారంతో మా నమ్మకం నువ్వే జగన్, బాడీబిల్డింగ్ షో, జై చంద్రన్న డ్యాన్స్, కోలాటం, తప్పెటగుళ్లు, చిన్నారుల కోలాటం, తోడపెద్దు సేవ, నెమలి, తీన్‌మార్, డీజే, రెయిన్‌డ్యాన్స్‌లు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

పట్టణంలో రాఖీ సందడి



నెహ్రూచౌక్‌లో రాఖీ దుకాణం వద్ద మహిళల సందడి

అనకాపల్లిటౌన్: అన్నయ్యను మించిన ధైర్యం, అక్కచెల్లెళ్లను మించిన ఆత్మీయులు ఉండరేమో. అందుకే రక్షాబంధన్ వేడుక వస్తోందంటే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల కళ్లల్లో అంతులేని ఆనందం. ఆ సందడి బుధవారం పట్టణంలోని దుకాణాల వద్ద కొట్టొచ్చినట్లు కనిపించింది. మహిళలు, చిన్నారులు పలు ఆకృతుల్లో ఉన్న రాఖీలను తిలకిస్తూ తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేశారు. నెహ్రూచౌక్‌లో రాఖీ దుకాణాలను ప్రత్యేకంగా తెరిచారు. స్థానికంగా ఉన్న పలు కూడళ్లలో ఆకర్షించేలా రాఖీ దుకాణాలు వెలిశాయి. దీంతో పట్టణంలో రాఖీ పండగ సందడి నెలకొంది.

ఆలయ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కనకారావు దంపతులు

పరవాడ: కలపాక శివారు స్వయంభూవరం గ్రామంలో శివాలయం మండపం నిర్మాణానికి సర్పంచ్ బొండా కనకారావు దంపతులు బుధవారం భూమి పూజ చేశారు. ఇప్పటి వరకు ఆలయ మండపం నిర్మాణానికి సహకరించిన దాతలకు సర్పంచ్ కనకారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పూజారి ఎస్.సత్యనారాయణ, బి.పైడింనాయుడు, జి.జానకీరామ్, ఇందల రామారావు, ఎం.శ్రీనివాసరావు, ఈ.శ్రీను, ఎ.రామకృష్ణ, టి.నర్సింగరావు, పి.త్రినాథరావు, టి.అప్పారావు, వై.నాగరాజు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులకు అవకాశం కల్పించాలి

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకుచ్చిన కార్డు ప్రైమ్ 2.0 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానానికి తాము వ్యతిరేకం కాదని.. దీంతో పాటు దస్తావేజు లేఖరులకు డాక్యుమెంటు రాసుకునే అవకాశం కల్పించాలని మండలంలోని దస్తావేజు లేఖరులు కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విధానాన్ని తామంతా ప్రోత్సహిస్తామని, తాము రోడ్డున పడకుండా చూడాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



కశింకోటలో స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



గవరపేట కల్లాలదిబ్బ వద్ద సామాజిక భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి గుడివాడ

కశింకోట: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోటలోని 3వ సచివాలయ పరిధి గవరపేట, వెలంపేట, దాడి వారి వీధి, పెదగుమ్మం ప్రాంతాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు ఆయనకు నీరాజనాలు పలికారు. మహిళలు హారతులు పట్టి పూల వర్షం కురిపించి ఆశీర్వదించారు. ప్రతి చోట స్థానికులు దుశ్శాలువాలు కప్పి సత్కరించి, సాదర స్వాగతం పలికారు.

కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. పొట్టి శ్రీరాములు పార్కు, దాడి వారి వీధి, వెలంపేటల్లో సిమెంట్ రోడ్లు, గౌరీపరమేశ్వరుల రథం షెడ్డును ప్రారంభించారు. గవరపేట కల్లాల దిబ్బవద్ద సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాల్సిదిగా అక్కడే ఉన్న అధికారుల్ని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఇంతగా తపిస్తోన్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందిగా కోరారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మాజీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు యల్లపు వరలక్ష్మి, బాలికల హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నడిపల్లి నాయుడు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు మేలు



తుమ్మపాల సదస్సులో మాట్లాడుతున్న అధికారులు



కొత్తపల్లిలో రుణ మేళాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- సభ్య రైతులతో అమూల్, బ్యాంకర్ల సమావేశం

అనకాపల్లి రూరల్/కశింకోట: జగనన్న పాల వెల్లువ పథకంతో పాడి రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రైతులు, బ్యాంకర్లు, అమూల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. తుమ్మపాల, కశింకోటలోని నూతలగుంటపాలెం, చింతలపాలెం, అచ్చెర్ల, కొత్తపల్లి, బుచ్చియ్యపేటలలో సభ్య రైతులకు అమూల్ ప్రతినిధులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సిబ్బంది, పశుసంవర్ధక శాఖ అధికారులు పాలవెల్లువ పథకంపై అవగాహన కల్పించారు. అమూల్ డెయిరీకి పాలు అందిస్తున్న రైతులకు అమలు చేస్తున్న రాయితీలు, బీమా, రుణ సదుపాయాలను వివరించారు. తుమ్మపాలలో 5 లీటర్ల సామర్థ్యంతో ప్రారంభమైన పాల సేకరణ కేంద్రం, ప్రస్తుతం రోజుకు 600 లీటర్ల పాలను సేకరిస్తోందన్నారు. సభ్య రైతులకు ఆవులు, గేదెల కొనుగోలు కోసం ఒక్కొక్కరికి రూ.1.65 లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పాల వెల్లువ పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని అధికారులు వెల్లడించారు. సహకార రంగంలో డెయిరీలను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయంగా పేరొందిన అమూల్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం 2020 డిసెంబరులో జగనన్న పాల వెల్లువకు శ్రీకారం చుట్టిందన్నారు. అనతి కాలంలోనే ఊహించని విజయం సాధించిందన్నారు. అమూల్ సంస్థ అత్యధిక ధర చెల్లించడంతోపాటు, ప్రతి రైతుకు బోనస్, నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకే పాల ధర క్రమ తప్పకుండా చెల్లిస్తున్నట్లు పాల ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, కొట్టి రాము, నిమ్మదల సోమేష్, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలు పడాల శారద, పశు వైద్యాధికారులు టి.ప్రశాంత్ కుమార్, చైతన్యమణి, ఎం.డయానా, డీసీసీబీ అధికారులు ఎం.రజని, భాస్కర్, రూట్ అధికారి గీతావాణి, అమూల్ డెయిరీ ఇన్‌చార్జ్ పి.సాయికిరణ్, ఉప సర్పంచ్ చదరం చిన్న, పంచాయతీ వార్డు సభ్యుడు తర సత్యారావు, రైతు నాయకుడు పీలా బుజ్జి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్జీవో కాలనీని అందంగా తీర్చిదిద్దుతాం



ఎన్జీవో కాలనీలో కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్జీవో కాలనీని అందంగా తీర్చిదిద్దనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. కాలనీలో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కాలనీలో వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. వార్డు మెంబర్ దొడ్డి రమణ పంపిన ప్రతిపాదన మేరకు రూ.30 లక్షలతో కాలువ నిర్మాణం చేపట్టామన్నారు. కల్వర్టు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టి కాలనీలో సకల సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీరాం నగర్ కాలనీలో కూడా కాలువలు, రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు వల్లీ భాయ్, పెంటకోట సాగర్, వేగి పవన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, పరమేష్, రామకృష్ణ, నాయుడు పాల్గొన్నారు.

దేవాలయ భూముల్ని ఆక్రమిస్తే చర్యలు

మండలంలో సత్యనారాయణపురం దేవస్థానం భూములను ఎవరైనా ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని దాడి రత్నాకర్ హెచ్చరించారు. ఆ భూములను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ దేవస్థానం భూమిని ఆనుకుని ఉన్న స్థలంలో కొందరు లే అవుట్ వేసి, దానికి పెద్దగా ధర రాకపోవడంతో, దేవాలయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దీనిపై దేవస్థానం అధికారులకు తెలుపగా, వెంటనే అడ్డుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంఘ వ్యవస్థాపకుడు మళ్ల రమణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డపాటి చినరాజారావు, పీఎస్‌కే నాయుడు, దొడ్డి రమణబాబు, శిలపరశెట్టి బాబీ, దాడి రాము, పెంటకోట సాగర్, వేగి పవన్‌కుమార్, తాతారావు, శ్రీరాంనాయుడు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



సబ్బవరం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీచేస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

సబ్బవరం: వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ సూచించారు. సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈహెచ్‌ఆర్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు ఐడీ క్రియేట్ చేసి రోగులకు ఇవ్వాలని సూచించారు. పీహెచ్‌సీలోని 104 డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి మందులు తరలించే విధానంపై పలు సూచనలు చేశారు. గొటివాడలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ రికార్డులు తనిఖీచేశారు. క్లినిక్ నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి చక్రవర్తి, డాక్టర్ బి.ఆశ పాల్గొన్నారు.

వరి సాగులో కాలి బాటలు తప్పనిసరి



వెదురుపర్తిలో వరి సాగు రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



యంత్రం సహాయంతో వేస్తున్న వరి నాట్లు

కశింకోట: వరి రైతులు పంట భూముల్లో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న సూచించారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో బుధవారం గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పొలాల్లో సకాలంలో పొటాష్ ఎరువు వేయాలన్నారు. వరి పంటలో కలుపు నివారణకు నామినీ గోల్డ్ 80 గ్రాములు, అల్మిక్స్ 8 గ్రాముల వంతున 200 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు ఫౌండేషన్ విత్తనాల తయారీలో మెళకువల్ని వివరించారు. ఈ సందర్భంగా కొడుకుల సూర్యనారాయణరాజు భూమిలో యంత్రాల సాయంతో వరి నాట్లు వేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఏవో విజేత, వీఏఏ లక్ష్మీ సింధూజ తదితరులు పాల్గొన్నారు.